క్లుప్తంగా

పశువులకు జోరుగా వ్యాక్సినేషన్

అంబాజీపేట: వర్షాకాలంలో వాతావరణ మార్పుల కారణంగా పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందని మండల పశువైద్యాధికారి డి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రస్తుత వర్షాకాలం ప్రారంభం కావడంతో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్‌లను మాచవరం తదితర గ్రామాల్లో బుధవారం వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాక్సిన్ వేశామన్నారు. పశువులకు ప్రాణాపాయం లేకుండా రైతులు ముందు జాగ్రత్తగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయించేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. పశువైద్య శాఖ సిబ్బంది కూడా గ్రామాల్లోని పశువులను పరీక్షించి టీకాలు వేస్తున్నారు.

దుర్గేష్‌కు అభినందనలు



మంత్రి దుర్గేష్‌కు అభినందనలు తెలుపుతున్న పార్టీ నాయకులు

అంబాజీపేట: మంత్రివర్గంలో స్థానం పొందిన నిడదవోలు జనసేన ఎమ్మెల్యే, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దుర్గేష్‌ను మర్యాద పూర్వకంగా బుధవారం కలసి పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, యర్రంశెట్టి నాగేంద్ర, కొప్పినీడి సాయిసూర్య, దుర్గాప్రసాద్, యర్రంశెట్టి జగదీష్ తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న జాన శంకరరావు, కుటుంబ సభ్యులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం మేరీమాత వృద్ధుల ఆశ్రమంలో మోరి గ్రామానికి చెందిన ప్రముఖ దాత, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు జాన నాగమల్లయ్య 103వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను నాగమల్లయ్య తనయుడు, మోరి చేనేత సొసైటీ చైర్మన్ జాన శంకరరావు కట్ చేసి వృద్ధులకు పంచారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. నాగమల్లయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాన విజయలక్ష్మి, మల్లిబాబు, ఆశ్రమ సిస్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కిట్ల పంపిణీ



మోరిలో విద్యార్థులకు కిట్లు పంచుతున్న సుబ్రహ్మణ్యం

సఖినేటిపల్లి: 2024–25 విద్యా సంవత్సరానికిగాను మండలంలోని వివిధ పాఠశాలలకు బుధవారం విద్యార్థుల కిట్లు పంపిణీని జిల్లా సమగ్ర శిక్షా అధికారి(సీఎంఓ) బీవీవీ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. మండలంలోని పాఠశాలలు అన్నింటికీ స్టాక్ పాయింట్‌గా ఉన్న మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నుంచి వీటిని పాఠశాలల బోధన సిబ్బందికి ఆయన అందజేశారు. ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, సీఆర్‌పీలు, పార్ట్ టైం టీచర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభం

కొత్తపేట: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు బుధవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో 8 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. బీఏ (ఎకనామిక్స్), బీఏ (పొలిటికల్ సైన్స్), బీకాం (జనరల్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (మేథమెటిక్స్), బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (జువాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పై కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, లైబ్రరీ, నూతన కంప్యూటర్ ల్యాబ్, జిమ్ తదితర సౌకర్యాలన్నీ కళాశాలలో ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులందరికీ ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, అన్ని సౌకర్యాలతో, ఉన్నత ప్రమాణాలతో క్లాసులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిగ్రీ అడ్మిషన్లు కావలసిన విద్యార్థులు 2 పాస్‌పోర్టు సైజు ఫొటోస్, ఆధార్ కార్డు, ఇంటర్మీడియెట్ మార్క్స్ లిస్టు, టీసీ, స్టడీ, పదో తరగతి మార్క్స్ లిస్టు, ఒరిజినల్, ఫొటోస్టాట్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు 9704302775, 9849711253లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి తెరచుకోనున్న స్కూళ్లు

- కళకళలాడనున్న సర్కారు పాఠశాలలు
- పాఠ్య పుస్తకాలు సిద్ధం



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్

అంబాజీపేట: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. సుమారు నెల రోజుల పాటు విద్యార్థులు అమ్మ ఒడికి పరిమితమై ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఆట పాటలు, అల్లర్లు, కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల వారితో ఆనందంగా గడిపారు. అమ్మ ఒడి నుంచి చదువులమ్మ ఒడికి చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. జూన్ 13 నుంచి తెరవనున్న బడులకు వెళ్లేందుకు ప్రతి విద్యార్థి ఉత్సాహంగా ఉన్నాడు. ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల భవనాలను శుభ్రం చేస్తున్నారు. ప్రాంగణంలోని చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. పండుగ వాతావరణంలో సర్కారు బడులు తెరిచేందుకు సన్నద్ధమవుతున్నాయి. సర్కారు బడులు కళకళలాడుతున్నాయి.

మూడు నియోజకవర్గాల్లో 584 సర్కారు బడులు

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని పలు గ్రామాల్లో 584 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు సిద్ధంగా ఉన్నారు. బడులు తెరిచిన తరువాత కొత్తగా చేరే విద్యార్థులు, ఒకటవ తరగతిలో చేరే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్త విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు.

వసతులు, విద్యార్థులు ఫుల్

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సర్కారు బడుల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయి. ఆధునిక విద్యాభ్యాసం కొనసాగించడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం చేరుతున్నారు. పాఠశాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన బల్లలు, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, ఐఎఫ్‌పీ ప్యానల్స్, ట్యాబ్‌లతో పాటు విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, షూ, టై బెల్టులు అందజేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీటు పొందే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలకు 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

> **ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం**
>
> 
>
> 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాం. పాఠశాలలు తెరచిన తరువాత అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేసేందుకు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తాం. ఇప్పటికే పాఠశాలలకు విద్యా కానుకలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.
>
> – కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ, అంబాజీపేట

కొత్త ప్రభుత్వానికి స్వాగతం పలుకుతూ వేడుకలు



మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాజోలు: నూతనంగా ఏర్పాటైన ఎన్డీఏ ప్రభుత్వానికి స్వాగతం పలుకుతూ రాజోలులో టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సమావేశ హాలులో నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారాన్ని తిలకించేందుకు ఎంపీడీఓ ఎస్.బాలాజీ పర్యవేక్షణలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఎంపీటీసీలు దార్ల కుమారిలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, పొదలాడ సర్పంచ్ కడలి సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజోలు మార్కెట్ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ, జనసేన శ్రేణులు సమావేశమయ్యారు. కేక్‌లు కట్ చేసి కార్యకర్తలకు పంచారు.

కూటమి పార్టీ నాయకుల హర్షం



మామిడికుదురులో ప్రసారాన్ని వీక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు

అంబాజీపేట: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని కూటమి పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో సీఎం ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై వీక్షించారు.

మండల పరిషత్‌లో లైవ్ టెలికాస్ట్

మామిడికుదురు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు.

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ల పై సీఎంగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కూటమి నాయకులు, అధికారులు వీక్షించారు. కూటమి నాయకులు వెలువలపల్లి, కె.జగన్నాథపురం తదితర గ్రామాల్లో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

అయినవిల్లి: మండలం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ మండల మహాసభ జరిగింది. సీఐటీయూ మండల కమిటీ సభ్యురాలు గుత్తుల వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ ప్రతినిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ వర్కర్స్ సమస్యలను, కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఇలా పలు డిమాండ్లు చేశారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఇసుకపట్ల మంగమ్మ, కోకన్వీనర్లుగా సుంకర నాగవేణి, గుత్తుల వెంకటలక్ష్మి, బూల ఉమామహేశ్వరి, ఈతకోట శ్రీనివాసరావు, రాయుడు శ్రీనివాసరావు, నేదునూరు లవరాజు, బండి లక్ష్మీదేవి మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది.

కొండెక్కిన కూరగాయల ధరలు

పప్పు దినుసులదీ అదే దారి



అంబాజీపేటలోని ఓ దుకాణంలో కూరగాయలు

అంబాజీపేట: కూరగాయల ధరలు ఆకాశాన్నంటి కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని రకాల కూరగాయలు, దుంపలు, ఆకుకూరల ధరలు చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. బుధవారం అంబాజీపేటలోని వారపు సంతకు వచ్చి ఎన్నో రకాల కూరగాయలు తీసుకువెళదామనుకున్న వినియోగదారులు వాటి ధరలు చూసి అవాక్కయ్యారు. దీంతో చేసేదేమి లేక కొన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలను చూస్తేనే ప్రజల గుండె గుభేలుమంటోంది. వాటి ధరలు ఒక్కసారిగి రెండింతలు పెరగడంతో ఏం కొనలేక పోతున్నామని వినియోగదారులు అల్లాడుతున్నారు. పప్పు దినుసులు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఎండాకాలం కారణంగా దిగుబడి లేదంటూ వ్యాపారులు అధిక ధరలకు పప్పు దినుసులు, కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థిల కారణంగాద కూరగాయల, ఆకు కూరల దిగుబడి ఈ ఏడాది తగ్గిందని రైతులు అంటున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.40 పలికింది. బంగాళాదుంపలు కిలో రూ.40, పచ్చిమిర్చి రూ.80, టమాట కిలో రూ.70, ఒక ములక్కాడ రూ.10, బీరకాయలు కిలో రూ.60 పలుకుతున్నాయి. వీటితో పాటు దొండ, బెండకాయలు, క్యారెట్, వంకాయ ఇలా ప్రతి కూరగాయల ధర పెరిగిందని వినియోగదారులు చెబుతున్నారు.

నివాస ప్రాంతంలో సెల్ టవర్ నిర్మించవద్దు

అంబాజీపేట: ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో అక్రమ సెల్ టవర్‌ను ఎట్టి పరిస్థితుల్లో నిర్మించవద్దని వాకలగరువు గ్రామస్తులు బుధవారం డిమాండ్ చేశారు. సెల్ టవర్ నిర్మించే ప్రాంతం వద్ద పనులను అడ్డుకున్నారు. స్థానికంగా ఉన్న చెరువుగట్టు ప్రాంతంలో సుమారు 200 మంది జనాభాతో 50 కుటుంబాల వారు నివసిస్తున్నారన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇండస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నాడని, అందువల్లే సెల్ టవర్‌ను అక్రమంగా నిర్మిస్తున్నారన్నారు. నివాస ప్రాంతాల వద్ద సెల్ టవర్‌ను నిర్మించడం వల్ల దాని నుండి వెలువడే రేడియేషన్, కిరణాల వల్ల మానసిక రుగ్మతలు వస్తాయన్నారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగులు వివిధ సమస్యలతో బాధపడాల్సి వస్తుందన్నారు. అందువల్ల సెల్‌టవర్ నిర్మాణ పనులను తక్షణమే నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం వల్లే నిర్మాణ పనులు చేస్తున్నారన్నారు. పనులు నిలుపుదల చేయని పక్షంలో అమలాపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని గ్రామస్తులు తెలిపారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో కొత్తపేట డీఎస్పీ



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో కొత్తపేట డీఎస్పీ దంపతులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారిని కొత్తపేట డీఎస్పీ వెంకటరమణ దంపతులు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం డీఎస్పీ వెంకటరమణ దంపతులను ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు డీఎస్పీకి స్వామివారి విశిష్టతను వివరించారు.

జేవీఎల్‌కు డాక్టరేట్ ప్రదానం

ముమ్మిడివరం: హర్యానా రాష్ట్రానికి చెందిన మేజిక్ అండ్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆంగ్లోపాధ్యాయుడు జేవీఎల్ నరసింహరావుకు డాక్టరేట్ పురస్కారం అందించింది. విద్యా, సామాజిక రంగాల్లో జేవీఎల్ అందించిన సేవలకు ఈ పురస్కారం వరించింది. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. జేవీఎల్‌ను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జగతా జానకీరామయ్య, ప్రద్మనాభరావు, పీవీవీ సత్యనారాయణరాజు అభినందించారు.

చదువుకొనే కాలం

- జూన్ నెల అంటేనే భయపడుతున్న సామాన్యులు
- పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పెరిగిన ఫీజులు, పుస్తకాల ధరలు



ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు (ఫైల్)

కొత్తపేట: వేసవి సెలవులు ముగిశాయి. పాఠశాలలు పునఃప్రారంభించే సమయం ఆసన్నమైంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఏటా పెరుగుతున్న ఫీజులు, పుస్తకాల ధరలు చూసి మధ్యతరగతి ప్రజలు భయపడుతున్నారు. బ్యాగు, యూనిఫాం, టై, బెల్టు, షూస్ వంటి వస్తువుల ధరలు కూడా ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలని మధ్య తరగతి కుటుంబాల్లో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఏదో విధంగా కష్టపడి ఫీజులు కట్టవచ్చులే అని ప్రైవేట్ స్కూల్స్ వైపు మక్కువ చూపుతున్నారు. తమ పిల్లలకు 5 సంవత్సరాలు, కొందరైతే నాలుగో సంవత్సరం నిండగానే ఏ పాఠశాలలో వేయాలి? ఎక్కడ బాగుంటుంది? అక్కడ చదువు బాగా చెప్పుతారా? అలాగే మా అబ్బాయి లేదా అమ్మాయి పదో తరగతి పూర్తయింది. ఏ కళాశాలలో జాయిన్ చేయాలి? అని ఆలోచిస్తున్నారు.. పలువురిని ఆరా తీస్తున్నారు. అందుకు అవసరమయ్యే ఖర్చును సర్దుబాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 13 న పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించారు.

జూన్ నెలంటే భయం

అనేక మధ్య తరగతి కుటుంబాల వారికి జూన్ నెల వచ్చిందంటే ఎక్కడ లేని భయం పట్టుకుంటుంది. ఈ నెలలో ఖర్చులు తడిసి మోపెడవుతుంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ కుటుంబాలే. ఓ పక్క వ్యవసాయ సాగు ప్రారంభం. మరో పక్క పాఠశాలలు పునఃప్రారంభం. అప్పో సప్పో చేసి తమ బిడ్డలను మంచి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. కాగా ప్రస్తుతం ఖరీఫ్ (తిలకరి) సీజన్ ప్రారంభ వేళ వ్యవసాయ పనులకు, తమ పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాలు తదితర వస్తువులకు డబ్బులు చూసుకోవాలని తల్లిదండ్రుల్లో ఆలోచన మొదలైంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు పాఠశాలలు నిర్వహిస్తున్నాయి. పాఠశాల తెరిచాక సంవత్సరం ఫీజును మూడు, నాలుగు వాయిదాల్లో చెల్లించాలి. అనాదిగా దాదాపు ప్రతి మండలంలో సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న రెండు, మూడు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలైతే తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులను బట్టి కొన్ని మినహాయింపులు ఇస్తున్నారు. ఎన్ని వాయిదాల్లో చెల్లించినా, ఎంత చెల్లించినా పరవాలేదులే.. అని చదువు చెప్పి ప్రోత్సహిస్తున్నాయి. కానీ ఇతర ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం కచ్చితంగా మూడు వాయిదాల్లో చెల్లించాలని, పుస్తకాలకు మొత్తం చెల్లించాలని చెపుతున్నాయని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

పిల్లల చదువులతో సామాన్యులకు ఆర్థిక భారం

ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ సుమారు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకూ ఉన్నాయి. బుక్స్‌కు సుమారు రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకూ ఉన్నాయి. అదే కార్పొరేట్ స్కూళ్లలో అయితే సుమారు రూ.28 వేలు నుంచి రూ.39 వేలు వరకూ వసూలు చేస్తున్నారు. ఇక మార్కెట్లో స్టేషనరీ, రెడీమేడ్ దుస్తులు, క్లాత్ షాపులు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు కావలసిన వస్తువుల షాపులు, షూ మార్టులు ఆయా కొనుగోళ్లతో సందడి నెలకొంది. నోట్‌బుక్స్ ధర రూ.20 నుంచి రూ.25 కాగా, బ్యాగులు రూ.200 నుంచి రూ.500 వరకు, షూస్ రూ.300 నుంచి రూ.600 వరకూ, రెండు జతల స్కూల్ డ్రస్‌లతో పాటు ఒక వైట్ డ్రస్, ఒక టీషర్టు సుమారు రూ.4 వేలు వరకూ ఉంటున్నాయి. ఆటో లేదా ఇతర స్కూల్ బస్ చార్జీలు నెలకు రూ.600 నుంచి రూ.1,000 వంటి వాటితో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.18 వేలు నుంచి రూ.28 వేలు వరకూ, కార్పొరేట్ స్కూల్స్ విద్యార్థులకు సుమారు రూ.40 వేలు నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు అవడంతో తల్లిదండ్రులకు చుక్కలు కనబడుతున్నాయి. అంతంత మాత్రం ఆదాయం గల కుటుంబాలకు పిల్లల చదువులు పెను సవాల్‌గా మారాయి. మొత్తం మీద పిల్లలు చదువుకున్నట్టు లేదని, వారికి చదువుకొన్నట్లు ఉందని పలువురు తల్లిదండ్రులు వాపోయారు.



ప్రైవేట్ బుక్ షాపులో విక్రయానికి సిద్ధం చేసిన బుక్స్

పింఛన్‌దారుల సంఘ గౌరవాధ్యక్షుడిగా బాపూజీ



ఆలమూరు: ఆలమూరు తాలూకా పింఛన్ల సంఘ గౌరవ అధ్యక్షుడిగా కేవీఆర్ బాపూజీ నియమితులయ్యారు. స్థానిక పింఛనర్ల సంఘ కార్యాలయంలో బుధవారం తాలుకా పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన పింఛనర్ల సంఘ సమావేశం జరిగింది. సభ్యులందరూ బాపూజీని గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్‌లో వివిధ విభాగాల్లో పనిచేసిన అనుభవంతో పింఛనర్ల సంఘ అభివృద్ధికి తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం బాపూజీని ఘనంగా సత్కరించారు.

పద్దయ్యకు ఘన నివాళులు

ఇటీవల మృతి చెందిన పింఛనర్ల సంఘ నాయకుడు బత్తుల పద్దయ్య సంతాప సభ జరిగింది. సభ్యులందరూ పద్దయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెన్షనర్ల సంఘ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ముగిసిన సువార్త సభలు

కొత్తపేట: ప్రవచన దేవుని సంఘం, యెరూషలెం చర్చ్ పాస్టర్, రీజినల్ ఓవర్‌సీర్ బిషప్ జి.అబెద్నగో – గ్రేస్ ఆధ్వర్యంలో మండలంలోని వాడపాలెం ఆనంద్ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు యేసుక్రీస్తు సువార్త సభలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ముగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ముఖ్య వర్తమానికులుగా బ్రదర్ జాన్‌వెస్లీ, సైలాస్ కె.శ్రీనివాస్, జోసఫ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవుల కోసం ప్రాణం ఇచ్చారని అభివర్ణించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. రవికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



మునిపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

ఉప్పలగుప్తం: ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు సూచించారు. మునిపల్లి గ్రామ పంచాయతీ పరిధి కోటిగట్టు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్ సాగు నేపథ్యంలో ముంపునకు తావు లేకుండా, సాగునీరు ప్రవహించేలా కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పులసుగంటి సోమేష్, దోనిపాటి బాలయ్య, దోనిపాటి సత్యనారాయణ, కామిశెట్టి ఏసు ఉన్నారు.